విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 01 ఫిబ్రవరి 2025 8 పేజీలు

మరో బాదుడు

- భూముల ధరలకు రెక్కలు
- హైవేల వైపు డిమాండ్
- వాణిజ్య సముదాయాలపై దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విలువలు శనివారం నుంచి పెరగనున్నాయి. జిల్లాల వారీగా సమీక్షలు పూర్తిచేసిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రూ. 4 వేల కోట్లకు పైగా అదనంగా ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తోంది. కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు కనీసం 0 నుండి 25శాతం వరకు పెరుగుదల ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నేటి నుండి కొత్త రుసుములు అమలులోకి రానున్న నేపథ్యంలో అధికారులు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, స్థిరాస్తుల కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు ఎలా ఉండబోతు న్నాయి..? ఇళ్ళు పొలాలు, స్థిరాస్తులు కొనాలి అనుకునే వారిపై ఈ ప్రభావం ఎలా ఉండబోతోంది..? ఈ విషయంలో నిపుణులు, రియల్ ఎస్టేట్ రంగం ప్రతినిధులతో పాటు పౌర సమాజం నుంచి ఎలాంటి వినతులు ఉన్నాయి..? తుది చార్జీల నిర్ణయంలో రాష్ట్ర స్టాంపులు,రిజిస్ట్రేషన్ శాఖ ఎలా వ్యవహరిస్తే మేలు..?వ్యవసాయ భూములు, ప్లాట్లు,స్థిరాస్తి నిర్మాణాలపై ప్రస్తుత రిజిస్ట్రేషన్ చార్జీల ప్రభావం ఎలా ఉంటుంది..? సాధారణంగా రిజిస్ట్రేషన్ చార్జీల భావం ఎలా ఉంది..? చార్జీల పెంపు నిర్ణయంతో ఎవరెవరిపై ఎంత భారం పడొచ్చు..? ఇదే అంశంపై జిల్లాలో చర్చనీయ అంశంగా మారింది. గతంలో నాన్ కమర్షియల్ ప్రాంతంగా ఉండి ఇప్పుడు ఆ ప్రాంతంలో కమర్షియల్‌గా అభివృద్ధి చెంది ఉంటే అక్కడ ఎంత వీలైతే అంత మార్కెట్ విలువ పెరగనుంది.

హైవేల వైపు డిమాండ్

జాతీయ, రాష్ట్ర హైవే లకు ఆనుకుని ఉన్న భూములకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధరలు అధికంగా చెబుతున్నారు. అమ్మకాలు జరగకపోయినా సరే కొనుగోలు చేద్దామంటే ధర అధికంగా ఉంటోంది. ప్రధాన రహదారులకు అనుకుని ఇరువైపులా ▶మిగతా 2లో..

ఉద్యోగ భద్రత కల్పించాలి

యానిమేటర్ల ప్రదర్శన

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యానిమేటర్ లందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని ఆ హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానిమేటర్లు ఆర్పీల యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబల్ల సూర్యారావుభవన్లో యానిమేటర్స్ ఆర్‌పిలు యూనియన్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ,తూర్పుగోదావరి జిల్లా , కాకినాడ జిల్లా ల నుండి యానిమేటర్లు ఆర్పీలు వందలాది మంది హాజరయ్యారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, చిరు ఉద్యోగులు ఔట్సోర్సింగ్ కార్మికులు అందరూ కూటమి ప్రభుత్వం హామీలను నమ్మి ఓట్లు వేశారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతన చట్టం ద్వారా రూ.26,000 జీతం ఇవ్వాలని మధు డిమాండ్ చేశారు. పెండింగ్లోవున్న జీతాలను వెంటనే మంజూరు చేయాలని మధు కోరారు. కొన్ని ప్రాంతాల్లో నూతనంగా వచ్చిన కూటమి నాయకులు రాజకీయ వేధింపులు చేస్తున్నారని వాటిని వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి మాట్లాడుతూ అర్బన్‌లో ఉన్న సంఘాలను రూరల్‌లోకి మార్చాలని ▶మిగతా 2లో..

మున్సిపల్ కౌన్సిల్ గరం..గరం

- పారిశుధ్య, పార్కుల నిర్వహణలపై గళమెత్తిన కౌన్సిల్
- గాడితప్పిన ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలపై ఆగ్రహం
- మున్సిపల్ విభాగాల్లో సమన్వయ లోపం ప్రజలకు శాపమంటూ మండిపాటు
- వాడివేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - పెద్దాపురం : పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ తీవ్ర స్థాయిలో మండిపడింది, పారిశుధ్య నిర్వహణ, పార్కుల నిర్వహణ, బిల్లుల చెల్లింపులు వంటి సమస్యలపై

ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పేదొకటి, చూపించేది ఒకటి, చేసేది ఒకటి. మున్సిపల్ విభాగాల అధికారులు, సిబ్బందికి సమన్వయ లోపం పుర ప్రజలకు శాపంగా మారిందంటూ తీవ్ర స్థాయిలో కౌన్సిల్ ధ్వజమెత్తింది. పెద్దాపురం పురపాలక సంఘ సర్వ సభ్య సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు ప్రజా సమస్యల పట్ల ఆధికారుల తీరుపై ప్రశ్నల వర్షం కురిపించారు. పనితీరు మార్చుకోవాలంటూ ఆయా విభాగాల అధికారులపై మండిపడ్డారు. సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందన్నారు. పార్కుల ▶మిగతా 2లో..

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ప్రత్యేక కమిటీలు : కలెక్టర్ షణ్మోహన్ సగిలి

▶వివరాలు 8లో..

భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర -భీమవరం: ఆరునూరైనా కలెక్టరేట్‌ను భీమవరం మార్కెట్ యార్డు ప్రాంగణంలో శాశ్వతంగా ఏర్పాటు చేయాల్సిందేనని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. కలెక్టరేట్ స్థల మార్పుపై వస్తున్న వార్తలపై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావుల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఛాంబర్ బర్ ఆఫ్ కామర్స్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్‌ను ఇంత రహస్యంగా ఎవరికీ చెప్పకుండా ఎక్కడో స్థలం

కేటాయించి తరలించడానికి ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారో ఏ వ్యక్తుల కొరకు మార్చాలనుకుంటు న్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం ఏర్పడిన కొత్తలో ఎటువంటి ప్రయాణ సౌకర్యాలు లేని చోట తాత్కాలికంగా కలెక్టరేట్ ఏర్పాటు చేస్తే కష్టమైనా ప్రజలు వ్యతిరేకించలేదని, తరువాత మార్కెట్ యార్డులో ఇరవై ఎకరాలు కలెక్టరేట్‌కు కేటాయిస్తూ జి.ఓ విడుదల కావడాన్ని ప్రజలంతా హర్షించారని గుర్తు చేశారు. మార్కెట్ యార్డులో ప్రతిపాదిత కలెక్టరేట్ తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, ఉండి, పాలకొల్లు, నర్సాపురం అన్ని రోడ్డు మార్గాలకు అనువుగా ఉందని, ఇప్పుడు ఎక్కడికో సుదూర ప్రాంతాలకు కనెక్టివిటీ లేని ప్రాంతానికి మార్చడం సరికాదని కోనాల విమర్శించారు. ప్రజలకు ఆమోదయోగ్యం కాని, పారదర్శకత లేని ప్రతిపాదనలు ఎవరు ▶మిగతా 2లో

కూటమి ప్రభుత్వం తక్షణమే లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: కూటమి ప్రభుత్వం తక్షణమే లబ్ధిదారులకు ఇళ్ళు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ),ఏలూరు 28వ డివిజన్ శాఖ కార్యదర్శి మావూరి విజయ, బి. కె.ప్రసాద్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఇంటి స్థలాలను పెంచి ఇవ్వాలని రెండవ రోజు అర్జీల నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్ర

మంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నదని, పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆ దిశగా గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టణ ప్రాంతాల్లో సెంటు భూమిని రెండు సెంట్లుగా మార్పు చేసి పట్టాలు జారీచేసి వారికి ఇళ్ల స్థలాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందించాలన్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి ▶మిగతా 2లో

పాడి రైతుల సంక్షేమానికి పలు పథకాలు అమలు

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

విశాలాంధ్ర-ముదినేపల్లి : పాడి రైతుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ముదినేపల్లి మండలం గురజ పాల ఉత్పత్తిదార్ల సొసైటీలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదార్లకు మేలైన యాజమాన్య పద్ధతులు, పశుపోషనకు సూచనలు చేసారు. 1969లో 24 మంది రైతులతో ఆరంభించి 140 మంది రైతులు నేడు 600 లీటర్ల పాలు సేకరించడం అభినందనీయమన్నారు. పాల రైతులకు మిల్క్ భీమా, కళ్యాణ మస్తు, క్షీరబంధు, ప్రతిభ వంటి పథకాలు నాణ్యమైన దానాలు ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పాలకవర్గ సభ్యులు, వల్లభనేని భాస్కర్, వెంకట సుబ్బారావు, పెడన జడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు జనరల్ మేనేజర్ తోట సత్యనారాయణ, అధ్యక్షులు ఉప్పలపాటి శ్రీ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సహాయకుడి మృతి

విశాలాంధ్ర -లింగపాలెం: కొణిజర్లలో రెవెన్యూ గ్రామ సేవకునిగా పనిచేస్తున్న గాలంకి రామారావు(59) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయన మృతి పట్ల డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావు, మండలంలో పనిచేస్తున్న గ్రామ సహాయకులు సంతాపం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కలెక్టరేట్ నిర్మించాలి (1వ పేజీ తరువాయి)

చేశారు, ఎవరి ఆస్తులు పెంచుకోవడానికి చేస్తున్నారో స్పష్టం చేయాలని అన్నారు. భీమవరం పట్టణంలో కాకుండా ఎక్కడో కలెక్టరేట్ నిర్మిస్తాం అంటే ఊరుకోబోమని, ఐక్య కార్యాచరణలో సిపిఐ భాగస్వామ్యం అవుతుందని కోనాల హెచ్చరించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి గోపాలన్ మాట్లాడుతూ కలెక్టరేట్‌ను ఎక్కడో భీమవరం పట్టణానికి దూరంగా ప్రజలకు అందుబాటులో లేని చోట మారుస్తున్నట్లు వస్తున్న వార్తలు ప్రజలకు ఆందోళన కల్గిస్తున్నాయన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులు కామన నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు, ఆలిండియా లాయర్స్ అసోషియేషన్ నాయకులు దిగుపాటి రాజగోపాల్, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి కొల్లాబత్తుల మహంకాళి, మాజీ జడ్పీటీసీ చినమిల్లి వెంకట్రాయుడు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కాకర రాజశేఖర్, కొర్ర శ్రీనివాస యాదవ్, సిపిఎం టౌన్ కార్యదర్శి బి.వాసుదేవరావు, ప్రజాసంఘాల నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, బేతు కృష్ణారావు, జి.రాజకుమార్, చిన్ని బాబూరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వర్లు, బళ్ల చినవీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వాలి (1వ పేజీ తరువాయి)

10వ తేదీనాటి పూర్తి చేసిన అర్జీలను జిల్లా కలెక్టర్ కి అందించే కార్యక్రమంలో లబ్ధిదారులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు తక్షణమే అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుని,ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్,సమితి సభ్యులు బళ్ల కనక దుర్గారావు, బి.శ్రీదేవి,ఆలూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

సిర్రా నవీన్, S/o. కృపానందం, డోర్‌నెం. 12-125,కొమట్లపాలెం, చెర్వి వద్ద, పెన్నాడ, గణపవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, పిన్:534197. నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.B6755780 ను ఒక పాలిథిన్ కవర్లో పెట్టుకుని ది.25.12.2024వ తేదిన ఉదయం 11 గం॥లకు మా ఇంటి నుండి పెన్నాడ మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యంలో సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పెట్టిన పాలిథిన్ కవరు జారిపడి పోయినది.

ఎంత వెతికనను దొరకలేదు.కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అంద జేయగలరు

గరంగరం (1వ పేజీ తరువాయి)

వద్ద కనీస శుభ్రత లేదని, శతాబ్ది పార్కును ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించే ముందు కౌన్సిల్ ముందుంచకుండా ఇప్పుడు తీర్మానం కోసం పెట్టడం సరికాదన్నారు. పర్యాటకులకు ఇప్పటి వరకు ఉచితమని చెప్పి గత నెల రోజుల నుంచి ఓ ప్రైవేట్ వ్యక్తి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నాడంటే కౌన్సిల్ పట్ల అధికారుల తీరు అర్ధమౌతోందన్నారు. చివరకు శానిటరీ ట్రాక్టర్లు నిర్వహణ పారిశుధ్య సిబ్బంది వాహనాలకు ఆయిల్ కొట్టించడంతో అవినీతికి పాల్పడుతున్న సంబంధిత పారిశుధ్య సిబ్బంది చోద్యం చూడడం విడ్డూరంగా ఉందన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణ లోపంతో కనీసం మేస్త్రీలు ఎవరు, లేబర్ ఎవరు కనీసం వాళ్ళు పనిచేస్తున్నారో లేదో కూడా పరిశీలించకపోతే ఎలా అంటూ నిలదీశారు. మున్సిపల్ కమిషనర్, ఆయా విభాగాల ఉన్నతాధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగా పారిశుధ్యం, ఇంజినీరింగ్ విభాగాల్లో సిబ్బంది సమన్వయ లోపం కొరవడిందన్నారు. సత్వరమే అవి చక్కబెట్టి పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజశేఖర్ అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మార్చుకోవాలన్నారు. కౌన్సిలర్ తలిశ సత్యభాస్కర్ మాట్లాడుతూ శ్మశాన వాటికల్లో పని చేసే సిబ్బందికి జీతాలు ఎందుకు పెండింగ్ పెట్టారన్నారు. అజెండాలో పెట్టే ప్రతీ అంశం సభ్యులకు అర్థమయ్యేలా ప్రచురించాలన్నారు. కౌన్సిలర్ కృష్ణ బాపూజీ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన సిబ్బంది పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా సిబ్బంది పనితీరు మార్చుకుని ప్రజలకు మెరుగైన సేవలందించా లని కోరారు. తొలుత మున్సిపల్ మాజీ చైర్మన్ బుచ్చి శ్రీదేవి మృతి పట్ల కౌన్సిల్ రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వాడివేడిగా కౌన్సిల్ సమావేశం కొనసాగింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కెవి పద్మావతి, డిఈ ప్రకాశరావు, మేనేజర్ జ్యోతిరాణి. మాజీ చైర్ పర్సన్ ముప్పన శ్యామలాంబ. కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరె వీర్రాఘవులు, కొట్టి పవన్ ఫ్లోర్, గోడ అప్పారావు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రత కల్పించాలి

(1వ పేజీ తరువాయి)

కోరారు. మూడు సంవత్సరాల కాలపరిమితి 64 జీవోను రద్దు చేయాలని శ్రీదేవి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఆర్. వరలక్ష్మి, కె.కనక మాట్లాడుతూ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అర్హతను బట్టి ప్రమోషన్స్, సిసి పోస్టులు మంజూరు చేయాలన్నారు. ఎస్ ఆర్ ఎల్ ఎం ద్వారా జీతాలు సొంత అకౌంట్లో వెయ్యాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముందు మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన ప్రదర్శన కొబ్బరికాయ మార్కెట్, తాడితోట సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షులు కుండ్రపు రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి. లావణ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి త్రిమూర్తులు, నాగలక్ష్మి, మణి, సిహెచ్ లలిత, జి. నాగజ్యోతి వీర వేణి, మేడిశెట్టి లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

మరో బాదుడు

(1వ పేజీ తరువాయి)

భూములకు డిమాండ్ ఉంటుందని రిజిస్ట్రేషన్ శాఖ ఒక అంచనాకు వచ్చింది. అక్కడే ధరలు పెంచేలా నిర్ణయం తీసుకోనుంది. కనిష్టంగా 10 శాతం నుండి 25 వరకు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు.ఏలూరు జిల్లాలో చెన్నై నుండి కోల్‌కత్తా వెళ్లే జాతీయ రహదారిపై ప్రధానంగా దృష్టి సారించారు. రాష్ట్ర హైవే లకు ఆనుకుని ఉన్న భూములపైన ఆరా తీసి 25శాతం వరకు పెరుగుతున్నట్లు తెలిపారు. నిర్మాణం కానున్న జాతీయ రహదారికి అనుకుని భూముల ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ధరలు పెరిగి రిజిస్ట్రేషన్ కానిచోట మాత్రం పెంచేందుకు రిజిస్ట్రేషన్ అధికారులు విముఖతతో ఉన్నారు.రిజిస్ట్రేషన్లు కానిచోట పెంచడం వల్ల ఫలితం ఉండదని యోచిస్తున్నారు. డిమాండ్ ఉన్న ప్రాంతాలకే పెంపు పరిమితమయ్యేలా నిర్ణయం తీసుకున్నారు.

నిర్మాణాలలో కదలిక

వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన ప్రాజెక్టు నిర్మాణాలకు ఇప్పుడు మోక్షం లభించింది. అపార్ట్మెంట్ల నిర్మాణానికి రియల్టర్లు, బిల్డర్లు ముందుకు వస్తున్నారు. ప్లాన్లు పెట్టుకుంటున్నారు. అభివృద్ధి కోసం భూ యజమానులను సంప్రదిస్తున్నారు. ఇవన్నీ ఇక్కడ అభివృద్ధికి సూచకంగా అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా రిజిస్ట్రేషన్ శాఖ సైతం భూముల విలువ పెంచింది. కొన్ని ప్రాంతాలకే పెంపు పరిమితం కాకుండా అర్బన్ భూమి విలువ పెంచారు.

వాణిజ్య సముదాయాలపై దృష్టి

పట్టణ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న పల్లెలు, పట్టణాలలోనూ వాణిజ్య సముదాయాల వద్ద విలువను 25శాతం పెంచారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలోనూ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో ఉంది. దీనివలన వాణిజ్య ప్రాంతాలలో డిమాండ్ ఏర్పడనుంది. మరోవైపు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాలలోనూ మార్పులు తీసుకువస్తున్నారు.జిల్లాలో పలు యూనిట్ లను పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ఇప్పటికే పల్లెలలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు.పట్టణాలలోనూ మున్సిపల్ నిధులకు వెసులుబాటు కల్పించాలని సంకల్పించారు. దీనివల్ల మౌలిక వసతులు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ఫలితంగా భూములు,స్థలాలకు డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నారు. దాంతో వాణిజ్య సముదాయాల వద్ద పెంపుదల చేసేలా రిజిస్ట్రేషన్ శాఖ వ్యూహం రచించింది.

నేటి నుండి పెరగనున్న రిజిస్ట్రేషన్ విలువలు

ఏలూరు జిల్లాలో 12 సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ఉన్నాయి.ప్రస్తుతం జిల్లా రిజిస్టార్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రం ఏలూరులో అర్బన్ ప్రాంతంలో 10, రూరల్ ప్రాంతంలో 15 శాతం, విలువ పెరగనుంది. భీమడోలులో అర్బన్,రూరల్ ప్రాంతంలో ఒకే విధంగా 15 శాతం వరకు పెంచారు. చింతలపూడిలో అర్బన్,రూరల్ ప్రాంతంలో 10 నుండి 15 శాతం వరకు పెంచారు. జంగారెడ్డిగూడెంలో అర్బన్, రూరల్ లో 0 నుండి 15 శాతం వరకు పెంచారు. కామవరపు కోట,పోలవరంలో మాత్రం అర్బన్ లో10 నుండి 20, రూరల్ లో 25 శాతానికి పెంచారు. వట్లూరులో అర్బన్, రూరల్ ప్రాంతాలలో 15 శాతం పెంచారు. కైకలూరు, మండవల్లిలలో అర్బన్ లో పది నుండి 20, రూరల్ లో 25 శాతానికి పెంచారు. నూజివీడు పరిధిలో అర్బన్ ప్రాంతంలో 10 నుండి 20, రూరల్ ప్రాంతంలో 20 శాతం పెంచారు.

జిల్లా ప్రజలపై రూ.30 కోట్లు అదనపు భారం...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగటం వలన అదనంగా రూ.30 కోట్లు జిల్లాపై భారం పడనుంది. అధికారులు తెలిపిన లెక్కల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.495 కోట్లు టార్గెట్ గా పెట్టుకోగా 2024 ఏప్రిల్ నుండి 2025 జనవరి 15వ తేదీ వరకు రూ.271 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అయితే మార్చి నెలాఖరుకు రూ.283 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే విద్యుత్ చార్జీల పెరుగుదలతో జిల్లా ప్రజలు అనేక అవస్థలు పడుతుంటే మరో బాదుడు రూపంలో రూ.30 కోట్లు అదనపు భారం వేసిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం

విశాలాంధ్ర -పెనుగొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెనుగొండ అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడుకు ఉదయం 11:53 నిమిషాలకు చేరుకున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనస్వాగతం పలికిన వారిలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు, జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ, శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, పులపర్తి రామాంజనేయులు, బొల్లినేని శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రాష్ట్ర ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ ఎస్ సిపిసి చైర్పర్సన్ పీతల సుజాత, మాజీ పార్లమెంటు సభ్యురాలు తోట సీతా రామలక్ష్మి, మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్, మాజీ శాసన సభ్యులు బండారు మాధవ నాయుడు,ముళ్ళపూడి బాపిరాజు, జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షులు ఐనంపూడి శ్రీదేవి, సర్పంచి నక్కా శ్యామల సోనీ, తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించడం పట్ల హర్షం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించడం పట్ల కొయ్యలగూడెం పట్టణ,మండల ఆర్యవైశ్య సంఘాల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా

పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మాటూరి సుధీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యులను దృష్టిలో పెట్టుకొని వాసవి మాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్యవైశ్య సంఘాల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ కోశాధికారి వెత్స పంగిడి, మండల అధ్యక్షులు చిరువూరి శ్రీను, వాసవి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మ బాబు,కొల్లూరు సత్తిబాబు, వాసు, గెరటయ్య, నగేష్,శ్రీను,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: రవాణా శాఖ యూనిట్ కార్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యార్థిని విద్యార్థులకు , బస్సు డ్రైవర్ కు,క్లీనర్లకు రోడ్డు భద్రత

సూచనలు,ట్రాఫిక్ సిగ్నల్స్ ను డ్రైవింగ్ లో తీసుకునే విధి విధానాల గురించి తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి. సురేందర్ సింగ్ నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలైన డాక్టర్ హనుమ లక్ష్మి ,ఆదిత్య డిగ్రీ కాలేజీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె. కృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యురాలైన డాక్టర్ హనుమలక్ష్మి యాక్సిడెంట్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణాపాయస్థితి నుండి కాపాడవలసిన సూచనలు విద్యార్థులకు తెలియజేసారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర- ఆగిరిపల్లి: మండల కేంద్రం ఆగిరిపల్లిలో వేంచేసియున్న శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహ స్వామి ఉత్సవ నిర్వహణ శుక్రవారం నుండి ఫిబ్రవరి 5 వరకు జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఏలూరు జిల్లా ఎస్పీ కే

ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు డి.ఎస్.పి ప్రసాద్ ఆదేశాల మేరకు నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. సీసీ కెమెరాల నిఘాలో ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధతో జరిగే విధంగా ట్రాఫిక్ నియంత్రణ, పిక్పాకిటింగ్, ఈవ్‌టీజింగ్ వంటి సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు, చర్యలు తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

వైద్యుల సూచనలు పాటించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పశువులలో వచ్చే వివిధ అనారోగ్యాలకు పశువుల వైద్యులు అందచేసే మందులను తప్పనిసరిగా పశువుల యజమానులు త్రాగించాలని సహాయ సంచాల కులు పి.ఎన్.వి .శేఖర్ దొర తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాలు

కార్యక్రమాన్ని మండలంలో బోడిగూడెం గ్రామంలో పశు వైద్యాధికారి బి.ఆర్. శ్రీనివాసన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. శిబిరం వద్దకు రైతులు వారి యొక్క పశువులను, మేకలను, కోళ్లను వచ్చి తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాక్సిన్ లను వేయించారు. శేఖర్ దొర పశువుల యజమానులకు పలు సూచనలను తెలిపారు. అనంతరం వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, పశుసంవర్ధక సహాయకులు పి. సాయిరాం, ఏ హెచ్ ఏ. కే సతీష్, వెంకటేశ్వరరావు, వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత పదవీ విరమణ ఆరోగ్యానికి సోపానం

విశాలాంధ్ర - ముదినేపల్లి : ప్రశాంతంగా పదవీ విరమణ చేయడం ఆరోగ్యానికి సోపానమని ఎంపీడీవో వై .రామకృష్ణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన కోడూరు వీర దుర్గాప్రసాద్ దంపతులను మండల పరిషత్ కార్యాలయం

ఘనంగా సత్కరించింది. జీవితంలో ప్రతి వ్యక్తికి కొన్ని ఒత్తిడులు, మరిచిపోలేని సంఘటనలతో మానసికంగా తలంచకుండా శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని కోరారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు సిహెచ్ నాగరాజు జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు వి. విజయకుమార్, సభ్యులు జి. చంద్రశేఖర్, ఎస్. సెల్వరాజు, పి.సందీశ్వరరావు, ఇ.పిఆర్డి అశోక్, ఏవోలు రమణరావు, రమణబాబు, పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది సాలువాలతో సత్కరించి పూదండలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో పలువురు కుటుంబ సభ్యులు , బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్‌కు ఆర్జీయూకేటి విద్యార్థులు

విశాలాంధ్ర- నూజివీటౌన్: ఆర్జీయూకేటీ నూజివీడు శ్రీకాకుళం క్యాంపస్ లో ఈసీఈ విభాగానికి చెందిన 80 మంది విద్యార్థులు శుక్రవారం మంగళగిరిలోని ఎఫెక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించినట్లు ఆర్జియుకెటి పి ఆర్ ఓ డాక్టర్ ఎల్ రాజేష్ ప్రకటనలో తెలిపారు.

ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా విద్యార్థులకు ఇండస్ట్రీలో జరుగుతున్న అంశాలు, విద్యార్థులు నేర్చుకోవాల్సిన విషయాలపై అవగాహన పెంపొందిస్తాయని పిఆర్ఓ తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఈఐటిపి శ్యామ్, శ్రీకాకుళం నూజివీడు హెచ్వోడీలు, శ్రీకాకుళం డిప్యూటీ ఏవో సతీష్, ఈసీఈ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంగిపోయిన కాజ్ వే

విశాలాంధ్ర-పెదపాడు: ఏలూరు -వట్లూరు -పెదపాడు వెళ్లే రోడ్డులో పాత పెదపాడు వద్ద రామిలేరు పై ఉన్న కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. అంచులు విరిగి ఊచలు బయటకు వచ్చాయి. దీనిపై ప్రయాణించాలంటే వాహన చోదకులు పగలే భయపడుతున్నారు. 20 అడుగుల వెడల్పులో రామిలేరు పై నిర్మించిన కాజ్ వేలో సుమారు 18 అడుగులు స్లాబ్ ధ్వంసమై నేలలోకి దిగబడిపోయింది. మిగిలిన రెండు అడుగుల వెడల్పు స్లాబ్ పైనే ద్విచక్ర వాహన దారులు ప్రయాణిస్తున్నారు. ఈ కాజు వే పరిధిలో 60 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది.ఈ ప్రాంత రైతుల ప్రయోజనం కోసం రెండు దశాబ్దాల క్రితం ఈ కాజ్‌వే నిర్మించారు. ఇక్కడ పండిన వరి, మినుము,పెసలు,పిల్లి పెసర పంటలను లోడింగ్ చేసిన తర్వాత ట్రాక్టర్లు,లారీలు ఎడ్లబండ్ల ద్వారా ఈ మార్గం ద్వారానే పెదపాడు నుంచి ఏలూరుకి తరలిస్తూ ఉంటారు. పెదపాడు, వీరమ్మకుంట, గుడిపాడు, సత్యవోలు, కొనికి, రాజుపేట, తోటగూడెం, వసంతవాడ, పునుకొల్లు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారు. ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా వట్లూరు, ఏలూరు లోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాల,పాలిటెక్నిక్,ఐటిఐ కళాశాలలకు ఈ మార్గం ద్వారా వెళ్లి వస్తూ

ఉంటారు.పెదపాడు నుంచి హనుమాన్ జంక్షన్,నూజివీడు,విజయవాడలకు వెళ్లాలంటే ఈ కాజ్ వే దగ్గర మార్గం.ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఈ కాజ్ వే ప్రమాదకరంగా ఉందని అధికారులు కనీసం బోర్డు కూడా పెట్టలేదు. గత రెండు సంవత్సరాలుగా పరిస్థితి ఇలానే ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.వట్లూరు నుంచి పెదపాడు వరకు 6 కిలోమీటర్ల మేర ఉన్న ఈ మార్గం లోని రోడ్డు పూర్తిగా పాడైపోయింది. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి కూడా లేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏలూరు -వట్లూరు -పెదపాడు మార్గంలోని కాజ్ వే, రహదారులను నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

విధి నిర్వహణలో ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అయిన హెడ్ వాటర్ వర్క్స్ (పంపుల చెరువు) లో పంపు హౌస్ క్లీనర్‌గా ప్రసాద్ విధి నిర్వహణలో చేసిన సేవలు ప్రశంసనీయమని నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్. ఎం.ఆర్. పెదబాబు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పదవీ విరమణ పొందిన జన్యావుల ప్రసాద్‌ను ఏలూరు కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ ప్రసాదు 18 సంవత్సరాల వయసులో పంపులు చెరువులో పంప్ హౌస్ ఎన్ఎంఆర్‌గా ఉద్యోగంలో చేరి 43 సంవత్సరాల 11 మాసాలు ఎటువంటి రిమార్క్ లేకుండా సుదీర్ఘ కాలం ఉద్యోగం చేసి నేడు ఉద్యోగ విరమణ చేయటం చాలా గొప్ప విషయం అన్నారు. పంపుల చెరువులో పనిచేయడం కత్తి మీద సాము లాంటిదని అటువంటి విభాగంలో 44 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేయటం నిజంగా అభినందించ తగ్గ విషయమన్నారు. ప్రసాదు తమ మిగిలిన సమయాన్ని ప్రజాసేవకు వినియోగించాలని ఆయన కోరారు. సన్మాన సభకు అధ్యక్షత వహించిన, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు, ది జోనల్ ము న్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రసాద్ తన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ యూనియన్ కార్యకలాపాలలో చురుకైన పాత్ర వహించారని తెలిపారు. ప్రసాద్ సత్కార సభలో ఏలూరు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.

సురేంద్రబాబు, డీఈఈ తాతబ్బాయి, రజాక్‌లు, ఏఈఈ సాంబశివరావు, ఎం. సాయి, టి. అరుణ్ కుమార్ లు,ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి. నారాయణరావు,ఎస్ఎంవి సుబ్బారావు, మధ్యాహ్నపు దుర్గారావు, ట్యాప్ ఇన్స్పెక్టర్ సిహెచ్ హరినాథ్ బాబు, ఫిట్టర్లు నారా శీను,బి. దుర్గాప్రసాద్, అకౌంటెంట్ లింగేశ్వరి,పి. రమేష్,విశ్రాంత డి.ఈ అచ్యుత రామారావు, విశ్రాంత ఏఈ సాయి ప్రసాద్, విశ్రాంత ట్యాప్ ఇన్స్పెక్టర్ లు బి.రాజు,వివి రమణ,బి నాగేశ్వరరావు ఉద్యోగ సిబ్బంది,బంధు మిత్రులు ప్రసాద్ ను శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. పంపుల చెరువు ఉద్యోగ సిబ్బంది,ఎస్ ఆర్ వన్ ఉద్యోగ సిబ్బంది,ఎస్ ఆర్ టు ఉద్యోగ సిబ్బంది ప్రసాద్ ను సత్కరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, అకౌంటెంట్ పిఎఫ్ చెక్కును ప్రసాద్ కు అందించారు. కార్పొరేషన్ నుంచి రావలసిన మిగిలిన సొమ్మును తొందరగా ప్రసాద్ కు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.తనకు జరిగిన సత్కారానికి జన్యావుల ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం 8 మందికి గాయాలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలోని సిఐఎర్ మాల్ వద్ద శుక్రవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి 8 మందిని గాయపరచింది.వారిలో ఇద్దరిని ఏలూరు రిఫర్ చేసారు. ఒక మహిళ ముఖంపై , మరో వ్యక్తి చెవి కన్నుపై విపరీతంగా కరిచింది. దీంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైరవిహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-కాళ్ల : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్.టి యు. నేతృత్వంలో తయారుచేసిన స్టడీ మెటీరియల్‌ను కాళ్ళ మండలంలో విద్యార్థులకు అందజేసినట్లు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జనార్ధన్ తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు, ఫ్యాప్టో చైర్మన్ సాయి వర్మ కలవపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో 60 మంది విద్యార్థులకు రూ.2100ల విలువైన స్టడీమెటీరియల్ అందించగా, సిసలి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు భోగేంద్రబాబు 72 మంది విద్యార్థులకు రూ. 2500 విలువగల విద్యా సామాగ్రిని, వేశ్వ జానకి రామరాజు మాలవాని తిప్ప హైస్కూల్లో 40 మంది విద్యార్థులకు రూ.1400లు విలువచేసే సామాగ్రిని అందించారని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో తెదేపా నాయకులు కాటేడ్డి శ్రీనివాసరావు, ఎస్.టి.యు మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాపారావు, గణేష్, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో హాస్టల్ వార్డెన్

విశాలాంధ్ర- నూజివీడుటౌన్: స్వీపర్ వద్ద హాస్టల్ వార్డెన్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సంఘటన నూజివీడు పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాలు ప్రకారం స్థానిక ఎంప్లాయిస్ కాలనీలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాల హాస్టల్ వార్డెన్ నాగమణి హాస్టల్లో స్వీపర్ గా విధులు నిర్వర్తిస్తున్న రూబీస్ అనే ఉద్యోగిని నుండి 30వేలు లంచం డిమాండ్ చేయడంతో రూబీస్ ఏలూరు ఏసీబీ ని ఆశ్రయించారు. దీంతో పథకం ప్రకారం వార్డెన్ నాగమణిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఎసిబి డిఎస్పి సుబ్బరాజు తెలిపారు. దర్యాప్తులో ఏసీబీ సిఐ ఎం బాలకృష్ణ, కె. శ్రీనివాస్, రాజమండ్రి సిఐ ఎన్ వి భాస్కర్ రావు పాల్గొన్నారు.

మోటేపల్లి బసవరాజు మృతి

పాడెమోసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : వేగవరం పుర ప్రముఖులు, జనసేన నాయకుడు, మాజీ సర్పంచ్, ప్రాథమిక సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షులు మోటేపల్లి బసవరాజు శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలిసిన గ్రామ ప్రజలు తండోపతండాలుగా వచ్చి అశ్రునయనాలతో నివాళు లర్పించారు.

మండల పుర ప్రముఖులు పలువురు బసవరాజు భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మోటేపల్లి బసవరాజు వేగవరం గ్రామపంచాయతీ సర్పంచ్ గా, ప్రాథమిక సహకార పరపతిసంఘం చైర్మన్ గా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు.మాజీ డిసిసిబి చైర్మన్ కరటం రాంబాబు, వైసిపి రాష్ట్ర నాయకులు జెట్టి గురునాథం, జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జి మేకా ఈశ్వరయ్య,లు తీవ్ర సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ సొసైటీ అధ్యక్షులు నులకాని నాగబాబు, జనసేన నాయకులు అనిశెట్టి శ్రీనివాసరావు, వేగవరం గ్రామపంచాయతీ సర్పంచ్ అనిశెట్టి వెంకన్నబాబు, ఎంపీటీసీలు కుక్కల సత్యనారాయణ , పోతన శ్రీను, టిడిపి నాయకులు ఆలపాటి దుర్గారామ ప్రసాద్, కుక్కల మాధవరావు, వైసీపీ నాయకులు నులకాని సూర్య చంద్ర రావు, దాకారపు రవి, మల్లాబత్తుల చైతన్య,మాజీ సర్పంచ్ మందపాటి చంద్రరావు, దాకారపు భాను, తదితరులు బసవరాజు మృతికి సంతాపం తెలిపారు.

పాడె మోసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ : జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, మాజీ సర్పంచ్ మోటే పల్లి బసవరాజు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చింతలపూడి ఎమ్మెల్యే శుక్రవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి., అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని పాడె మోశారు. ఆయనతోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పలువురు పాల్గొన్నారు.

శ్రీ జగదాంబ అమ్మవారి ఆలయ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : శ్రీ జగదంబ అమ్మవారి ఉత్సవాలను గతం కంటే మరింత ఘనంగా నిర్వహించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పోలవరం నియోజకవర్గ

జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్ అన్నారు. శుక్రవారం జీలుగుమిల్లిలో జిఎస్ఎం గెస్ట్ హౌస్ వద్ద ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే బాలరాజు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా గడ్డమణుగు రవికుమార్, ఆలయ కమిటీ ఛైర్మన్‌గా చిరి వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్‌గా కొండపల్లి ప్రసాదు, కోలా మధు, కార్యదర్శులుగా కుందేటి సత్యనారాయణ, ధారా మధు, ఉప కార్యదర్శులుగా నారగాని నరేంద్ర ,పొలాజీ దుర్గాప్రసాద్, కమిటీ మెంబర్లుగా బొంతు వెంకటేశ్వరరావు ,ఉలవల శివ, ఉలవల వెంకటేశ్వరరావు, రూప సత్యనారాయణ, కోలాధర్మరాజు, కొత్తపల్లి శీను, కక్కిరాల మురళి, కోరుకొండ శ్రీనివాస్, గద్దె సుబ్రహ్మణ్యంలను నియమించినట్లు వారు తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం : ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఎంపిడీఓ మణి కుమారి తెలిపారు. మండలంలోని ఏపిగుంట, తిరుమల దేవిపేట, బొర్రంపాలెం గ్రామాల్లో ఎన్నికల నియమావళి అమలు తీరును శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయించి ఫ్లెక్సీలు తొలగించినట్లు ఆమె తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఆమె తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీసీ సంఘం నాయకులు పలువురు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉంగుటూరు గ్రామ పంచాయతీ కమ్యూనిటీ హాల్లో ఉంగుటూరు నియోజక వర్గ స్థాయి బీసీ సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి

తాడిశెట్టి శివప్రసాద్ అధ్యక్షత వహించారు, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం బీసీలు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను అధికారంలో ఉన్న వారు బీసీల పట్ల చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షునిగా తాడిశెట్టి శివప్రసాద్‌ను రాష్ట్ర అధ్యక్షులు శంకర్రావు ప్రకటించారు. నియామక పత్రాన్ని సభలో అందజేశారు. సమా వేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, శెట్టిబలిజ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిట్టిబొయిన రామలింగేశ్వర రావు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి హనుమంతు, బుస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలి

శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ

విశాలాంధ్ర-కైకలూరు: యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చినట్లుగా ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని

అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ కైకలూరు లోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి,రాష్ట్రాభివృద్ధికి వాసవి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విలువలు పాటించిన పాత్రికేయుడు సూర్యనారాయణమూర్తి

- 14వ వర్ధంతి సభలో పలువురి నివాళి
- ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ప్రదానం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : విలువలు పాటించిన పాత్రికేయునిగా యద్దనపూడి సూర్యనారాయణ మూర్తిని సమాజం చిరకాలం గుర్తుంచుకుంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ పాత్రికేయుడు, సుప్రసిద్ధ సంఘసేవకుడు యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి 14 వర్ధంతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. తాడేపల్లిగూడెం జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రెస్‌క్లబ్, ఎ.పి.యు.డబ్ల్యు.జె. జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తమ్మిసెట్టి రంగసురేష్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ గత పద్నాలుగేళ్లుగా యద్దనపూడి పేరిట జిల్లాస్థాయిలో ఉత్తమ జర్నలిస్టు అవార్డు ఇవ్వడం, సీనియర్లకు సత్కారాలు చేయడం తమకు గర్వకారణమని రంగసురేష్ అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్ ఇన్ ఛార్జ్ డి. రామకృష్ణ మాట్లాడుతూ మీడియాలో సాంకేతికత పెరగడంతో దాని పనితీరు మెరుగయ్యిందని, వార్తాసేకరణ కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. ఎన్నో సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. మీడియా రంగంలో అవకాశాలు కూడా బాగా పెరిగాయని అన్నారు. యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి ఒక విలేకరిగా సమస్యలపై వార్తలు రాయడంతో పాటు , వాటి పరిష్కారానికి కృషి చేశారని , పట్టణంలో సాంస్కృతికరంగానికి విశేషమైన సేవలు అందించారని, నేటితరం పాత్రికేయులు యద్దనపూడి ని ఆదర్శంగా తీసుకోవాలని డి రామకృష్ణ అన్నారు. సీనియర్ పాత్రికేయుడు కట్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి నైతిక విలువలు కలిగిన పాత్రికేయుడని , పట్టణంలో అనేక సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారని అన్నారు. ఇటీవల కొందరు పాత్రికేయుల ధోరణులవల్ల మీడియా విశ్వసనీయత ప్రశ్నార్ధకంగా మారిందని, దీనిపై పాత్రికేయులు ఆత్మ విమర్శ చేసుకోవాలని కోరారు. యద్దనపూడి సేవలను గుర్తు చేస్తూ ఐజేయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఎ.పి.యు.డబ్ల్యు.జె. జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు యద్దపల్లి మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వి.లక్ష్మయ్య, ప్రెస్ క్లబ్ కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు, సీనియర్ పాత్రికేయులు తేతలి గంగాధర రెడ్డి, ఆకుల నవదుర్గా ప్రసాద్, త్యాగరాజ గానసభ అధ్యక్షుడు గరికపాటి బాపయ్య శర్మ , యద్దనపూడి తనయుడు యద్దనపూడి సుబ్బారావు, మనుమడు విన్నకోట సాయిరామ్ బాపిరాజు తదితరులు మాట్లాడారు.యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి స్మారక జిల్లాస్థాయి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును 2024 వ సంవత్సరానికి గాను తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి విలేఖరి మైలవరపు రవికిరణ్ కు అందచేసారు. అవార్డుగా 5116 రూపాయల నగదు , శాలువా, నూతన వస్త్రాలు , జ్ఞాపిక, పూలమాలలు అందచేసారు. యద్దనపూడి పేరిట జిల్లాలో సీనియర్ పాత్రికేయులకు చేస్తున్న గౌరవసత్కార కార్యక్రమంలో భాగంగా భీమవరం వార్త విలేఖరి ఘంటా వేణుగోపాల్ , ఏలూరు సాక్షి విలేఖరి సి. హెచ్. రామకృష్ణంరాజు, జంగారెడ్డిగూడెం ఎబిఎన్ ఆంధ్రజ్యోతి విలేఖరి పాలడుగుల రామకృష్ణ ను సన్మానించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదవతరగతి టాపర్ గా నిలిచిన మీసాల అనూష కు యద్దనపూడి సూర్యనారాయణమూర్తి కుమార్తె యద్దనపూడి పద్మావతి 5116 రూపాయల పారితోషికం అందచేసారు. తొలుత తాలూకా కార్యాలయం కూడలిలో ఉన్న యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి విగ్రహానికి ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్ ఛార్జ్ డి.రామకృష్ణ పూలమాల వేసి నివాళు లర్పించారు. పెద్ద సంఖ్యలో పాత్రికేయులు , యద్దనపూడి కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

మా గ్రామాలను 41 కాంటూరులో కలపాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : ముంపునకు గురవుతున్న చాగలపల్లి, కోర్రాజులగూడెం, తాట్కూరు కాలని, నడింగొమ్ము కాలని తదితర గ్రామాలను 41 కాంటూర్‌లో కలపాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్ కార్యాలయం ముందు నిర్వాసితులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది గోదావరి వరదలకు ముంపునకు గురవుతున్న తమ గ్రామాలను 45 కాంటూర్ నుండి తొలగించాలన్నారు. వరదల సమ యంలో పిల్లలతో, వృద్ధులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు అధికారులు ప్రజాప్రతినిధులు చూస్తూనే ఉన్నారన్నారు. రహదారి సౌకర్యం లేక కనీస వసతులు లేక ఆ సమయంలో పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమణి ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేకుండా ముంపు గ్రామాల సర్వే చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితులకు అనేక

సమస్యలు ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకో కుండా ఇష్టానుసారమైన రీతిలో ప్రభుత్వాలు వ్యవహ రిస్తున్నాయని దుయ్యబట్టారు. వెంటనే ముందుగా ముంపుకు గురవుతున్న మండలంలోని ప్రతి గ్రామాన్ని సర్వే చేపట్టి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న మమ్ముల్ని గుర్తించి తమ ఇబ్బందులను తొలగించాలని కోరారు. నిర్వాసితులకు మండలంలోని వివిధ పార్టీలు మద్దతు పలికాయి.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.12(1744533)/2019/డి.బి తేది : 31-01-2025

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్టు టెండరు నోటీసు నెం.22(1-4),BHI// General/2024-25/E1/E2లోని జనరల్‌ఫండ్స్ నుండి 4 పనులకు సంబంధించి రూ. 16.23 లక్షలతో ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎం.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుతున్నవి. మిగిలిన వివరములు ఇప్రొక్యూరుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో. జిల్లా (సెల్ 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.

కమిషనరు,
భీమవరం పురపాలక సంఘం

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తలకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్.ఐ., వి చంద్రశేఖర్,ఏఎస్ఐ ఎం. సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.ఐ. వి.చంద్రశేఖర్,

ఏ.ఎస్ఐ ఎం. సుబ్బారావు లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వాళ్ళందరు హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ ఫోన్ లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, విద్యార్థులు ఎవరూ కూడా ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. అనంతరం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి. జనార్దన్ రావు, ప్రిన్సిపాల్ సిహెచ్. హనుమాన్ చౌదరి, ఎన్.ఎస్. ఎస్. యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, శ్యామ్ విద్యార్థిని విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నగదు ప్రోత్సాహక ప్రతిభ పురస్కారం

విశాలాంధ్ర - గణపవరం: గణప వరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో నగదు ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోకలపాటి నిర్మల కుమారి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

2023-24 విద్యా సంవత్సరంలో అత్యధిక ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు గణపవరం మండలం సరిపల్లె గ్రామ వాస్తవ్యులు ప్రస్తుతం ఎన్ ఆర్ ఐ గా ఇతర దేశాల్లో ఉంటున్న రామ్-లక్ష్మణ్ వారి తల్లిదండ్రులను ఉన్న ఊరును మర్చిపోకుండా తీసుకున్న దానికి కృతజ్ఞతగా నగదు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించి ఈ రోజున అందజేయడం జరిగిందని ఆమె తెలిపారు.మొదటి బహుమతి 40 వేల రూపాయల నగదు పురస్కారం ఎలగం హారిక, రెండవ బహుమతి 20వేల రూపాయల నగదు అలేఖ్య, మూడవ బహుమతి పదివేల రూపాయల నగదు ఎర్రంశెట్టి కృష్ణ కుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతలపాటి సూర్య రాజు, జి.గోపాల కృష్ణం రాజు, అల్లూరి గంగ రాజు, ఆదిరెడ్డి సత్యనారాయణ, నడిపల్లి శ్రీరామ్, డాక్టర్ సిహెచ్ చైతన్య డాక్టర్ టి.అక్కిరాజు, కె.వి గణేష్ కుమార్ ,డాక్టర్ కె. స్వరూప రాణి, డాక్టర్ జి. వెంకటరమణ, కె. గిరిబాబు, డాక్టర్ షేక్ పర్వీన్, పిడి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా మురళీమోహన్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కొత్తపేట : కొత్తపేట డిఎస్పీగా సుంకర మురళీ మోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఇక్కడ డిఎస్పీగా పని చేసిన గోవిందరావు విశాఖపట్నం బదిలీపై వెళ్లారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్ 1999-2005 సమయంలో కొత్తపేట ఎస్సైగా పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్నికల కోడ్ అనుగుణంగా పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనుగుణంగా పెన్షన్ పంపిణీ జరుగుతుంది అని ఎంపిడిఓ ఎమ్ భారతి అన్నారు. నేడు పెన్షన్ దారులకు నగదు చెల్లింపుల జరగనున్నాయి. ఈ సందర్భంగా ఎంపిడిఓ భారతి మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకులు ఎవ్వరూ పెన్షన్ పంపిణీలో పాల్గొన్నరాదు అని అన్నారు. మండల వ్యాప్తంగా 20 సచివాలయల పరిధిలో 11459 పెన్షన్ లబ్ధిదారులకు 4 కోట్ల 87 లక్షల 52వేల రూపాయలు నగదును 289 మంది సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంపిణీ చేయనున్నారన్నారు. అలాగే కొత్తగా మంజూరు అయినా విడో పెన్షన్ల పంపిణీ చేయరాదు అని ఉత్తర్వులు వచ్చాయని అన్నారు. పెన్షన్ పంపిణీ చేయు సిబ్బంది ఎన్నికల కోడ్ అనుగుణంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు.

డీఆర్వోకు సత్కారం

విశాలాంధ్ర - కడియం : గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా సేవా పురస్కారం అందుకున్న డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ టి సీతారామమూర్తిని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శులు కె జయరాజు, ఆర్ సత్యనారాయణ మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు వి లజపతిరాయ్, కడియం ఎంఈఓ ఎ నాగేశ్వరరావు తదితరులు ఘనంగా సత్కరించారు. డిఆర్ఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నటు వంటి ఎలక్షన్ డ్యూటీని సేవ పుస్తకంలో నమోదు చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన డిఆర్ఓ తక్షణమే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సరీ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కడియం : తూర్పు గోదా వరి జిల్లా, కడియం మండలం, కడియపు లంకలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు, నర్సరీ పెద్దల ఆధ్వర్యంలో 2025 డైరీ కం, డైరెక్టరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ పెద్దలు మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, పాతంశెట్టి చినమహాలక్ష్మి నాయుడు, తాడల చక్రవర్తి, తిరుమల శెట్టి భాస్కరరావు, రత్నం కృష్ణమూర్తి, బోర్సు సుబ్బారాయుడు, బోర్సు వెంకటేశ్వరరావు, నర్సరీ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు మల్లు పోలరాజు, పెనుమాక కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నవీకరణ సర్వే : కలెక్టర్

విశాలాంధ్ర - అమలాపురం : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జిల్లాలోని సాంఘిక సంక్షేమ వెనుకబడిన తరగతుల వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో అన్ని వసతులు మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా నవీనీకరణకు చేపట్టిన సర్వే ప్రతిపాదనలు కాంపోనెంట్‌గా విద్యార్థినీ, విద్యార్థుల దామాషా ప్రాతిపదికన రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఇంజనీర్లను, సంక్షేమ అధికారులను ఆదేశించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఆర్ అండ్ బీ పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు సంక్షేమ వసతి గృహ అధికారులతో చేపట్టిన సర్వే నివేదికలు లోపభూయిష్టంగా ఉండి స్పష్టత కొరవడిందని వీటిని మరల పునఃపరిశీలించి కాంపోనెంట్లు వారీగా క్లాసులు విద్యార్థుల దామాషా ప్రాతిపదికన పూర్తి స్పష్టతతో చెక్ లిస్ట్ ప్రకారం స్టాండర్డ్ రేట్లు ప్రకారం అంచనాలు రూపొందించి ఒక వారంలో సమర్పించాలని ఆదేశించారు. ఈ నివేదికలు అందిన పిదప వాటిలో కొన్నింటి అంచనాలను యాదృచ్ఛికంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి తదుపరి కార్యాచరణను రూపొందిస్తూ టెండర్లు పిలిచి ఆయా పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల అవసరాలు వసతులను తీర్చే దిశగా ప్రతిపాదనలు అన్నింటినీ క్రోడీకరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంక్షేమశాఖ డివిజనల్ ఇంజనీర్ సుబ్బరాజు, ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి ఇంజనీర్లు, వివిధ వసతి గృహాల సంక్షేమ అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - కడియం : జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులందరూ రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని జాతీయ రహదారుల ప్రాజెక్టు మేనేజర్ కె బాలసుబ్రమణ్యం, టోల్ మేనేజర్ కర్రి వీరవెంకట సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఎన్ హెచ్ ఏఐ పిడి కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై వేమగిరి వరకు రాజమండ్రి సీఆర్పీఎఫ్ 42 వ బెటాలియన్, టోల్ ప్లాజా ఉద్యోగులతో జాతీయ రహదారుల టెక్నికల్ మేనేజర్ అన్సారి జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో రోడ్డు భద్రతపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే పెద్ద వాహన డ్రైవర్ల అందరూ సీట్ బెల్ట్ ను ఉపయోగించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఇంజనీర్ ఈ వెంకటరమణ, రాజమండ్రి క్రైమ్ సీఐ రాంబాబు, ధవలేశ్వరం సిఐ గణేష్, క్యాషియర్ సురేష్, టోల్ ప్లాజా మేనేజర్ కరీం, హెచ్ఆర్ రమేష్ పలువురు పోలీసులు, ఎన్ హెచ్ ఏఐ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-దేవరపల్లి: జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా దేవరపల్లి ఎస్సై వి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దేవరపల్లిలో అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 10వ తరగతి ఇంటర్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సై సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి ట్రాఫిక్ రూల్స్ తెలుసుకొని పాటించాలన్నారు తల్లిదండ్రులకు చుట్టుప్రక్కల వారికి ట్రాఫిక్ రూల్స్ తెలియజేయాలని సూచించారు. స్కూలుకు వచ్చేటప్పుడు విద్యార్థులు జాగ్రత్తగా రావాలని మోటారు సైకిళ్లు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం బి శ్రీలక్ష్మి ఏఎస్ఐ కె నాగభూషణం సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో ప్రజలను చంపేస్తారా : మన్యం

విశాలాంధ్ర - సామర్లకోట : కలుషిత నీటిని ప్రజలకు సరఫరా చేసి ప్రాణాలు తీసేస్తారని కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అధ్యక్షతన శుక్రవారం ఉదయం జరిగింది. ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ ఉండడంతో ఎజెండాలో అంశాలన్నీ వాయిదా వేయగా సభ్యులు జీరో అవరల అడగడంతో జీరో అవర్లో ప్రజా సమస్యలపై కౌన్సిలర్లు గళం విప్పారు. గోదావరి జలాలు కలుషితంగా మారిపోయినయని ఈ కలుషిత జలాల వల్ల రెండు మంచినీటి చెరువుల్లోనూ చేపలు చనిపోయినవి అని అదే నీటిని ప్రజలకి సరఫరా చేసి ప్రజల ప్రాణాలు తీసేస్తారని కో ఆప్షన్ సభ్యులు మన్యం చంద్ర రావు ప్రశ్నించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గోదావరి జలాలు డైరెక్ట్‌గా ఇస్తున్నామని, తెలుసుకొని మాట్లాడాలని ఇలా అయితే సమావేశంలోకి వెళ్లిపోతాను అనడంతో కౌన్సిలర్లు ఒక్కసారిగా అధికారులు ధోరణి ఈ విధంగా ఉంటే ఎలా అని కౌన్సిలర్లు మన్యం చంద్రరావు, నేతల హరిబాబు, పిట్ట సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఊబ జాన్ మోజెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని కలవచర్ల గ్రామంలో జరుగుతున్న నూతన సిసి రోడ్డు నిర్మాణం పనులను స్థానిక టిడిపి సీనియర్ నేత గ్రామ సర్పంచ్ వడ్డి వెంకన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో, ఇంచార్జ్ డిఎల్పిఓ ఏ రాజు పరిశీలించి వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించి, గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ఈ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ రహదారికి ఎంపిపి నిధులు రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో సుమారు 70 మీటర్ల పొడవు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్మాణం పనులను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓబ్బిలిరెడ్డి వేణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శేషగిరిరావుకు పదవీ విరమణ సత్కారం

విశాలాంధ్ర దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు పీలా శేషగిరిరావుకు పదవి విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, ఆయన అభిమానులు మాట్లాడుతూ 43 సంవత్సరాలు ఉద్యోగం చేసి అందరి మన్నాలను పొందారన్నారు. ఉపాధ్యాయ వృత్తికి శేషగిరిరావు వన్నె తెచ్చారన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత శేషగిరిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంపీపీ పాఠశాలలలో ఎక్కువ రోజులు ప్రధానోపాధ్యాయులుగా పనిచేశానని యాదవోలు జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా ఐదున్నర సంవత్సరాలు పని చేశానన్నారు. మొత్తం 43 సంవత్సరాలు ఉద్యోగం చేసి నేడు పదవి విరమణ చేయటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా శేషగిరిరావు కృష్ణవేణి దంపతులను ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల మాన వతా బాల్ ఉత్సవం కమిటీ అభిమానులు స్నేహితులు ఘనంగా సత్కరించారు. దేవరపల్లి మండలంలో హైస్కూలు ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు పాల్గొని శేషగిరిరావు కృష్ణవేణి దంపతులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సున్నం వరప్రసాద్ కూటమి నాయకులు సుదురు మాటి శ్రీనివాస్ అని శెట్టి శ్రీనివాస్. సూరి శివ సూర్యచంద్రరావు. హై స్కూల్ ఉపాధ్యాయులు చిలక సత్యనారాయణ కంటమణి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపం వద్ద ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అమ్మవారికి పూజలను పురోహితులు మామిళ్ళపల్లి రామకృష్ణ వేద మంత్రోచారణలతో జరిపించారు. ముఖ్య అతిథులుగా కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ భార్య మణి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు జీను మణిబాబు, వాసవి క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, ఆర్యవైశ్యులు కొత్త భైరవ కృష్ణ, కొత్త రాము అమ్మవారిని దర్శించుకున్నారు.

సూపర్ సిక్స్ హామీలతో మోసం : విశ్వరూప్

విశాలాంధ్ర - అమలాపురం : గడిచిన ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు చేసి ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ అమలు చేయలేని నిస్సిగ్గుగా చెప్పటం హాస్యాస్పదంగా ఉందని మాజీమంత్రి జిల్లా వైకాపా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ విమర్శించారు. శుక్రవారం సాయంత్రం విశ్వరూప్ స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో విశ్వరూప్ మాట్లాడుతూ చంద్రబాబు గడిచిన ఎన్నికల్లో చేసిన ఏ వాగ్దానాన్ని నెరవేర్చలేదని విద్యార్థులకు ఇస్తానన్న ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. ఉచిత బస్సు రోడ్డు ఎక్కకుండానే మూలన పడిందని ఆరోపించారు.

జర్నలిస్టు సలీం ఆత్మహత్యపై విచారణ జరపాలి

విశాలాంధ్ర – సామర్లకోట : జర్నలిస్టు నిఘా ఎడిటర్ సలీమ్ హత్య, ఆత్మహత్య అనేదానిపై పూర్తి విచారణ జరిపించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు స్వాతి ప్రసాద్ నవీన్ రాజ్ తదితరులు సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్‌ని కలిసి కోరారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ 20 రోజుల క్రితం జరిగిన ఘటనపై పలు అనుమానాలు ఉన్నాయని సలీమ్‌తో పాటు ఉన్న మరొక మహిళ, వ్యక్తిని అదుపులోకి తీసుకుని పూర్తి విచారణ చేయాలన్నారు. సలీమ్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలనీ ఒకవేళ ఆత్మహత్య అయితే ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు నాయకులకు సిఐ కృష్ణభగవాన్ విచారణ చేస్తామని అన్నారు. సిఐని నాయకులు పలువురు జర్నలిస్టులు ఉన్నారు.

ఆదిత్య వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం ఆదిత్య విశ్వవిద్యాలయం వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు కర్ణాటకలో దేవిహోసూరు, హవేరి హార్టికల్చర్ ఇంజనీరింగ్ & ఫుడ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫుడీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా ట్రెండ్స్. భవిష్యత్తు దిశా' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు విభాగాధిపతి డా బి కృష్ణకాంత్ తెలిపారు. వివిధ పోటీలలో ఆదిత్య నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పోస్టర్ ప్రదర్శనలో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, మౌఖిక ప్రదర్శనలో తృతీయ, ప్రాజెక్టు ప్రదర్శనలో తృతీయ స్థానం పొందారు అని డా కృష్ణకాంత్ తెలిపారు. విజేతలను, మెంటార్స్ డా వేదాంతం సాయి కృష్ణ ఎం మారుతి కుమార్, జె లహరిక సూర్య సాయి, డి దాక్షాయణిలను ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా ఎన్ సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి అమలాపురం వారిలో కోర్టు,

A.S. No.35/2024

Between: **యెల్లమెల్లి వెంకటేశ్వరరావు** S/o. స్వామి, వయస్సు: 55 సం॥లు, శానపల్లిలంక, అయినవిల్లి (మం), డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా...**అప్పిలెంట్**

and

శీలం సత్యనారాయణ ....వగైరాలు ప్రతివాది

To,

1. **శీలం సత్యనారాయణ** S/o. గోడి అప్పన్న, వయస్సు: 89 సం॥లు, కందికుప్ప, కాట్రేనికోన మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
2. **శీలం శ్రీను** S/o. ముసలయ్య, వయస్సు: 37 సం॥లు, కందికుప్ప, కాట్రేనికోన మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

పై నెంబరు అప్పీలు దావాలోపై కోర్టు వారి ఆర్డరు ప్రకారంమీకు నోటీసు/సమన్లు పంపినా మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పత్రికా ప్రకటన చేయుచున్నాము. ది.**14-02-2025** వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు 1,2వ ప్రతివాదులు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పైన తెలిపిన వారి కోర్టులో హాజరు అయి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరుచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ముషిణి రామకృష్ణారావు
ముషిణి S.K.N. మణి
అమలాపురం **న్యాయవాదులు, అమలాపురం.**
తేది:30-01-2025 **సెల్: 92916 04565**

పారిశుద్ధ్య పనులు పరిశీలన

విశాలాంధ్ర – కాకినాడ : ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ..కాకినాడ నగరపాలక కమిషనర్ భావన ఐఏఎస్ శుక్రవారం తెల్లవారుజాము నుంచి కాకినాడలో అనేక ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ ఎలా జరుగుతుందనే విషయంపై కమిషనర్ దృష్టిసారించారు. దీనిలో భాగంగా నగరంలోని జీజీహెచ్ ఏరియా రోడ్డు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వీధి, మెయిన్‌రోడ్డు, దేవాలయం వీధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను కమిషనర్ భావన పరిశీలించారు. చెత్త సేకరణ, తరలింపు, వాహనాల పనితీరును గమనించారు. సిబ్బందికి అనేక సూచనలు చేశారు. అనంతరం అక్కడి నుంచి 14వ సర్కిల్ కరణంగారి సెంటర్, కృష్ణుడి గుడి వీధి, విశాల్‌మార్ట్ ఏరియాలో పర్యటించారు. ఇక్కడ చెత్తను ఇష్టానుసారంగా పడేస్తున్న మద్యం దుకాణదారుడికి ఫైన్ వేయాలని ఆదేశించారు. డస్ట్‌బిన్లలో మాత్రమే చెత్త వేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మందుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర – సీతానగరం: మండలంలో అనేక మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్స్పెక్టర్ పి కళ్యాణి ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా చినకొండేపూడి గ్రామ పంచాయతీ పరిధిలో లక్ష్మి గణేష్, వెంకట సాయి, రామ దుర్గా, మునుకూడలి పంచాయతీ పరిధిలో సాయి దుర్గ అను నాలుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఈ దుకాణాల్లో కొనుగులు బిల్లులు కన్నా అమ్మకం బిల్లులు తక్కువ ఉన్నాయని అలాగే అర్ఎంపి చిట్టీలపై మందులు ఇస్తున్నారని, భవిష్యత్ లో ఎవరికైనా ప్రమాదం జరిగితే దుకాణం యజమానులే బాధ్యత వహించాలన్నారు. హరహత కలిగిన వైద్యులు చిట్టీలపై మాత్రమే మందులు అమ్మకాలు జరపాలన్నారు. అలాగే కేసులు నమోదు చేసిన వారు రికార్డులను రాజమహేంద్రవరం డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి రికార్డులను తీసుకురావాలని ఆదేశించారు. ఇకపై నిబంధనల ప్రకారం మందుల అమ్మకాలు జరపాలని సూచించారు. లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ తనిఖీలో సిబ్బంది, మందుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

ట్రస్టు సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-దేవరపల్లి: కళ్ళే లలిత ట్రస్టు సేవలు ఎంతో అభినందనీయం అని గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ డాక్టర్ ఎస్ జాన్ పీటర్ పేర్కొన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రం అన్నదానం కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు సతీమణి లలిత జయంతి వేడుకలు నిర్మగిరి పుణ్యక్షేత్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రం డైరెక్టర్ జాన్ పీటర్ మాట్లాడుతూ కళ్ళే నాగేశ్వరరావు సతీమణి లలిత మృతి చెందిమూడు సంవత్సరాల సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం సందర్భంగా ఆమె పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి ట్రస్టు ద్వా పేదలకు సహాయ సహకారాలు అందించడం, ఆమె జయంతిని పురస్కరించుకొని పేదలకు బియ్యం సీట్లు పండ్లు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. అన్నదానం కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు బియ్యం స్వీట్లు పండ్లు అందజేశారు ఈ కార్యక్రమంలో ఫాదర్ జాన్ శివ దుర్గారావు శ్యామ్ పండు భాస్కర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు తయారుచేయండి : డ్వామా పీడీ

విశాలాంధ్ర – జగ్గంపేట : కూలీలకు పనులు కల్పించే విధంగా ప్రతిపాదనలు తయారు చేసి నేటి లోగా పంపించాలని డ్వామా పిడి అడపా వెంకట లక్ష్మీ ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పనుల సీజన్ ప్రారంభమైంది. నూతనంగా ఏర్పడిన మేట్ల ద్వారా కూలీలకు ఎక్కువ రోజులు కల్పించాలని, ఇంకా పనులు ఆమోదంలేని గ్రామాల్లో పనులకు టెక్నికల్ అసిస్టెంట్లు వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి జిల్లా కార్యాలయానికి పంపించా లన్నారు. శ్రమశక్తి సంఘాల గ్రూపు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎపిఓ కృష్ణంరాజు, ఈసి రోజాలత, టెక్నికల్ అసిస్టెంట్లు గోడే వెంకటేశ్వరరావు, కొల్లి రాంబాబు, వై సత్యనారాయణ, జ్యోతుల వెంకటేశ్వరరావు, పి అమర్ నాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించండి : తహసీల్దార్

విశాలాంధ్ర – గోపాలపురం : ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు నాయకులు సహకరించాలని మండల తహసీల్దార్ కే.అజయ్ బాబు సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో వివిధ రాజకీయ నాయకులతో ఎమ్మెల్సీ ఎన్నికల విధివిధానాల గూర్చి, ఓటర్ల వివరాలను గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ అజయ్ బాబు మాట్లాడుతూ గోపాలపురం మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు మూడు పోలింగ్ కేంద్రాల్లో 1779 మొత్తం ఓట్లు ఉన్నట్లు తెలిపారు. మొదటి పోలింగ్ బూత్ 259 జిల్లా పరిషత్ హై స్కూల్ లో గ్రాడ్యుయేషన్ పురుషులు 421, స్త్రీలు 278, మొత్తం699, జిల్లా పరిషత్ హై స్కూల్ రెండవ బూత్ 260 లో స్త్రీలు275, పురుషులు,425, మొత్తం 700, మూడవ బూత్ 261 జేబీ స్కూల్ లో స్త్రీలు131,పురుషులు 249 మొత్తం ఓట్లు,380, నేటి వరకు తప్పులు సవరణ ఫారం 7 లో 7 గురు, ఫారమ్ 8లో 25, ఫారం 18 లో5 ఓటర్లు నమోదు చేసుకొనుటకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం ఎన్నికలు కోడు అమలులో ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు, టీడీపీ నాయకులు యువిడి ప్రసాద్, వైఎస్ఆర్ సిపి నాయకులు జీవి శ్రీనివాస్, ఎలక్షన్ డి టి. పివి సాంబశివరావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కె నల్లరాజు, వీఆర్వోలు వీఆర్ఏలు ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల చిరకాల కోరిక నెరవేరిన వేళ

విశాలాంధ్ర – కొత్తపేట : ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి మాతగా పిలవబడే కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం పట్ల ఆర్యవైశ్యుల ఆనందానికి అవధులు లేవు. ఎప్పటినుంచో ప్రభుత్వాలను ఆర్యవైశ్యులు అధికారికంగా ప్రకటించాలని కోరుతూ వచ్చారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారి చిరకాల కోరికను నెరవేర్చడంతో వాసవి మాత ఆత్మార్పణ గావించిన రోజును సంతోషంతో పండగలా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విచ్చేశారు. ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ వాసవి మాతకు పట్టు వస్త్రాలు ఎమ్మెల్యే సత్యానందరావు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ హింసకు తావివ్వకుండా అహింసా మార్గాన్ని ప్రోత్సహిస్తూ తనకు తానే ఆత్మార్పణ చేసుకున్న అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్నాల రామకృష్ణ, బూసి జయలక్ష్మి భాస్కరరావు, నంబూరి రెడ్డయ్య, విళ్ల మారుతి ప్రసాద్, మిద్దె ఆదినారాయణ, యల్లమిల్లి జగన్ మోహన్, గుబ్బల మూర్తి, ముద్రగడ సుబ్బారావు, పల్లి కొండ సుదీర్, ఎండూరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

పటికబెల్లం తులాభారం

విశాలాంధ్ర దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం నాలుగు తులాభార కార్యక్రమాలు అంగరంగ వైభవం జరిగాయి దేవరపల్లికి చెందిన నందిగం శ్రీధర్ దేవి మణి దుర్గ కుమార్తెకి పటిక బెల్లం చిల్లర నాణాలతో తులాభారాలు నిర్వహించారు. కొవ్వూరు మండలం టీడీపీ గ్రామానికి చెందిన పాలదుగుల రమేష్ రామ తులసి దంపతుల కుమారుడు అభిరామ్ చౌదరికి పటిక బెల్లం తోను దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన శ్రీకాకుళం హనుమంతు చందు దంపతుల కుమార్తె కు పటిక బెల్లం తో తులాభారాలు నిర్వహించారు అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు కామిశెట్టి మంగ, మాతు, సీత పెన్నమణి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఫోరెన్సిక్' నాల్గో సంచిక ఆవిష్కరణ

విశాలాంధ్ర – గండేపల్లి : ఆదిత్య ఫోరెన్సిక్ సైన్స్ కాలేజ్, సూరంపాలెం రూపొందించిన భారతదేశపు మొట్టమొదటి ఫోరెన్సిక్ సైన్స్ ఆధారిత ద్వైమాసిక పత్రిక ఫోరెన్సిక్స్ నాల్గొవ సంచికను కాకినాడ ASP ఎంజెవి భాస్కరరావు, ట్రైనీ DSP ఎం జీవన ప్రారంభించారు. ఫోరెన్సిక్ అవగాహనను పెంపొందించడంలో మ్యాగజైన్ కీలక పాత్ర పోషిస్తోందని ASP ఎంజెవి భాస్కరరావు తెలిపారు. భవిష్యత్ తరాలకు సైబర్, ఇతర నేరాలు వాటి శిక్ష చట్టాలు అమలును ఇటువంటి మ్యాగజైన్ ద్వారా తెలుసుకోవటానికి సహాయపడుతుంది అని తెలిపారు. ఈ కొత్త ఎడిషన్ మునుపటి సంచికలకు వచ్చిన అద్భుతమైన స్పందనను అనుసరిస్తోందని కళాశాల ప్రిన్సిపల్ విలాస్ అనిల్ చవాన్ తెలియజేసారు.

నారాయణమూర్తి ఆత్మహత్య

విశాలాంధ్ర – కరప : కరప ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయం ఇన్చార్జి సీఈవో 2017 నుంచి పనిచేస్తున్న కరప గ్రామానికి చెందిన నక్క నారాయణమూర్తి కాకినాడ ఒక ప్రైవేట్ లాడ్జిలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. పోలీసులు అతని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో ఆత్మహత్య గల కారణాలను తెలుసుకునేందుకు అతని కుటుంబ సభ్యులు జీకే రెసిడెన్సీ వల్ల సిసి ఫుటేజీ వివరాల అందించాలని ఆందోళన చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కొవ్వూరు: సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహా సభలు ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరులో జరుగుతున్నట్లు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాంబాబు, ఎం.సుందరబాబులు తెలిపారు. రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫిబ్రవరి 3న జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.రవి, నాయకులు గంగాధర్, రాధాకృష్ణ, చిన్నబాబు, జ్యోతిబసు పాల్గొన్నారు.

బడి వయస్సు పిల్లలు బడిలోనే ఉండాలి : కమిషనర్

విశాలాంధ్ర - పిఠాపురం : అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ నగర్ (యానాదుల కాలనీ)లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బుల్లి రాణి మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు బాల బాలికలు అందరూ బడిలోనే ఉండాలని అన్నారు. పిల్లలతో పనులు చేయించరాదని తెలిపారు. న్యాయవాదులు అనిశెట్టి కాశీ విశ్వనాథరెడ్డి, గుదిమెళ్ళ భాస్కరాచార్యులు మాట్లాడారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఎ వాసంతి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా బడి వయసు పిల్లలు భిక్షాటనలో, వీధి బాలలుగా, ప్రమాదకర పనుల్లో ఉండకుండా పాఠశాలలో చదువుకునే విధంగా వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండలలీగల్ సర్వీసెస్ కమిటీ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వీధిబాలలకు, తల్లిదండ్రులకు అవగాహన

విశాలాంధ్ర - సామర్లకోట : వీధి బాలల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్ వెంకటరావు ఆధ్వర్యంలో, విద్యాశాఖ అధికారి పి పుల్లయ్య, కార్మిక శాఖ అధికారి రవి సంయుక్త ఆధ్వర్యంలో సామర్లకోట గూడరాలు వద్ద వీధి బాలలకు వారు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నేటి బాలలే రేపటి బావి భారత పౌరులుగా తీర్చి దిద్దు కోవాలన్నారు. బాలలు బడికి వెళ్లి పాఠాలు, ఆటలు ఆడుకొని ఆనందగా గడపాలన్నారు. 14 సంవత్సరాల లోపు బాలలు అందరు పాఠశాల లోనే ఉండాలని ఎవరు కూడా పిల్లలను ఉపయోగిం చుకుని బిక్షాటన చేస్తూ విధి బాలలుగా ఉండరాదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సామర్లకోట పట్టణంలో బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, ఆటోస్టాండ్ పబ్లిక్ ట్రాఫిక్ ప్రాంతాలు, పరిసర ప్రాంతాలలో బిక్షాటనలో ఉన్న బాలలను, వీధి బాలలను గుర్తించుట కొరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 6 గురు బిక్షాటన తల్లి లుతో చేస్తున్న బాలలను గుర్తించి ఈ యాచక వృత్తిలో ఉన్న తల్లులకు కౌన్సిలింగ్ ఇచ్చి బిక్షాటన చేయడం నేరమని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి బాలల సం రక్షణాధికారులు కె శ్రీనువాస్, జె విజయ, సుధాకర్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ బి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో పదోతరగతి ఒక మైలురాయి : కలెక్టర్

విశాలాంధ్ర - రాజానగరం : భారతీయ విద్యా విధానంలో పదో తరగతి ఓ ముఖ్య కూడలి వంటిదని, ఉన్నత భవిష్యత్తుగా మార్చే మైలురాయి వంటిదని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల ప్రతిభకు ప్రేరణ అనే అంశంపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి అధ్యక్షతన మండలం లోని గోదావరి గ్లోబల్ వర్సిటీ(జిజియు)లో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ తరగతి గదుల్లో బోధించే పాఠ్యాంశాలు పఠించడం ద్వారా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. జీవితంలో ఏ విధంగా స్థిరపడాలనుకుంటున్నారో ఇప్పుడే నిర్ణయించుకుని ఆ మేరకు కృషి చేయాలనీ, అందుకు పదో తరగతి సరైనదని చెప్పారు. విద్యార్థులు కష్టపడి బాగా చదివితే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని మీ జీవితం మీ చేతుల్లోనే ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం ఎస్ శోభారాణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,ముందస్తు సంసిద్ధత పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తొలుత జీజీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు వారి జీవితంలో తొలిసారిగా హాజరవుతున్న పబ్లిక్ పరీక్షలే పదో తరగతి అన్నారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్అంబే ద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు జీజీయు యాజమాన్యం సమకూర్చిన పరీక్షా సామాగ్రిని కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ముప్పిడి రాజు, జీజీయు డీన్ డాక్టర్ ఎన్.లీలావతి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీజీ రామానుజమ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి : జేసీ

విశాలాంధ్ర -కొవ్వూరు : ఇసుక రీచ్ పాయింట్స్ వద్ద ఏర్పాటు చేయనున్న వే బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు స్పష్టం చేశారు. శుక్రవారం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ దుర్గా ప్రసాద్‌లతో కలిసి ఇసుక రీచ్‌లను పరిశీలించారు. జేసీ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, వివిధ ఇసుక రీచ్ ల ద్వారా రవాణా చేస్తున్న ఇసుక అనుమతించిన పరిమితికి లోబడి లోడింగ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇసుక రీచ్ ల వద్ద విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండాలని ఆదేశించారు. ఆర్డీవో రాణి సుస్మితతో కలిసి ఏరినమ్మ, కొవ్వూరు, ఔరంగాబాద్ 1 మరియు 2 , వాడపల్లి , దొండగుంట ర్యాంపుల వద్ద ఏజెన్సీస్ ఏర్పాటు చేస్తున్న వే బ్రిడ్జి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

లోకేష్‌ని విమర్శించే స్థాయి గొల్లపల్లికి లేదు : శ్రీనివాస్

విశాలాంధ్ర - రాజోలు : యువగళం పాదయాత్ర మా యువ నాయకుడు లోకేష్ బాబుకు ప్రమోషన్ అని ఇప్పుడు ప్రత్యేకించి ప్రమోషన్ అవసరం లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దావోస్ పర్యటన లోకేష్ ప్రమోషన్‌కు అని రాజోలు వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి సూర్యారావు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మీ నాయకుడు జగన్ లాగా నాలుగు గోడల మధ్య మాట్లాడే విధానం మా నాయకుడిది కాదన్నారు. ప్రజల మధ్యలో పరదాలు కప్పుకుని తిరిగే మీ నాయకుడికి కావాలి ప్రమోషన్. ఐదేళ్లపాటు ఆంధ్ర రాష్ట్రాన్ని అంధకారం చేశారన్నారు. మా నాయకుడు లోకేష్ బాబు ఐటీ, విద్యాశాఖ మంత్రిగా రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు కోసం, నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎంతో శ్రమిస్తున్నారు. ఇప్పుడు మీ నాయకుడికి ప్రమోషన్ అవసరం అని అన్నారు.

ప్రజల అభివృద్దే లక్ష్యంగా పనిచేశాం : ముద్రగడ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలో ఒమ్మంగి గ్రామంలో ముద్రగడ పద్మనాభం, వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీఎంపీ ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ సీఎంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే చంద్రబాబు ఇచ్చిన అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి జగన్ ప్రవేశపెట్టిన పథకా లను రద్దు చేయడమే అభివృద్ధిగా ప్రచారం చేసుకోవడం దారుణ మన్నారు. నియోజకవర్గంలో ప్రజలు మా కుటుంబాన్ని ఆదరించా రన్నారు. వైసీపీని బలోపేతానికి గిరిబాబుకు కార్యకర్తలు అభిమానులు సహకారాన్ని అందించాలన్నారు.జడ్పీటీసి బెహరా రాజేశ్వరి, దొరబాబు, ఎంపీపీ జీకే సుధాకర్, ఆర్ నాని పాల్గొన్నారు.

మద్యం షాపులు గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆలమూరు : రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై కేటాయించిన మద్యం దుకాణాలను గీత కార్మికులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కెవిడికె ప్రసాద్ అన్నారు. స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సీఐ ఐడి, నాగేశ్వరరావు అధ్యక్షతన గీత కార్మికులతో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో సూపరింటెండెంట్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా గీత కార్మికులకు 13 మద్యం షాపులను కేటాయించిందన్నారు. లాటరీ విధానంలో దక్కించుకున్న మద్యం షాపులకు ప్రభుత్వానికి చెల్లించవలసిన రుసుంలో 50 శాతం మేర రాయితీని అందిస్తున్నామన్నారు, ప్రభుత్వం అందించే రాయితీల వల్ల గీత కార్మికుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఒక వ్యక్తి ఎన్ని ధరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. ఒకటి కంటే ఎక్కువ షాపులు లాటరీలో తగిలినా ఒక షాపు మాత్రమే కేటాయించడం జరుగుతుందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ధరఖాస్తుల స్వీకరణకు సమయం దగ్గర పడుతున్నందున సర్కిల్ పరిధిలో కేటాయించిన మూడు దుకాణాలకు త్వరితగతిన ధరఖాస్తు చేసుకోవా లన్నారు. ధరఖాస్తుతో పాటు తిరిగి చెల్లించని రూ.రెండు లక్షల డీడీ, నివాస, కుల ధృవీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. ఈనెల ఐదుతో ధరఖాస్తుల స్వీకరణ పూర్తవుతుందని, 6న ధరఖాస్తులను పరిశీలించి ఏడున లాటరీ తీయనున్నామన్నారు. ఎక్సైజ్ ఎస్సై పి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికిఏర్పాట్లు చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : రాబోయే వేసవితో ఎలాంటి తాగునీటి ఇబ్బందులను నగరవాసులు ఎదుర్కోకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ ఇంజినీరింగ్ విభాగ ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్ భావన ఐఎఎస్ శుక్రవారం ఉదయం విక్టోరియా వాటర్ వర్క్స్ ఆవరణలో ఉన్న తాగునీటి ఫిల్టరేషన్ ప్లాంట్‌ను పరిశీలించారు. వాటి పనితీరు ఎలా ఉన్నదీ సుమారు గంట పాటు గమనించారు. నీటిని ఎలా శుద్ధి అవుతోంది? నీటి స్వచ్ఛత, ఫిల్టరేషన్ బెడ్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కొన్నాళ్లకు పనిచేయకుండా ఉన్న ఫిల్టరేషన్ ప్లాంట్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మత్యరాజు, డీఈ ఫణి తదితరులు కమిషనర్ భావనకు అక్కడున్న పరిస్థితులను వివరించారు.

నిబంధనలు పాటిద్దాం.. సురక్షిత ప్రయాణం చేద్దాం.....

విశాలాంధ్ర - నిడదవోలు : నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్సై పరమహంస అన్నారు. స్థానిక ఐ లవ్ యు నిడదవోలు సెంటర్ ప్రాంగణంలో ఏ కె ఆర్ జి స్కూలు ఆధ్వర్యంలో పబ్లిక్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత వారోత్స వాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిడదవోలు పట్టణ ఎస్సై పరమహంస, సమిశ్ర గూడెం రూరల్ ఎస్సై పి. వీరబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థి విద్యార్థులు,పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డి. ముప్పవరం గ్రామంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా హెల్మెట్ పై అవగాహన సదస్సు నిర్వహించిన సమిశ్ర గూడెం ఎస్సై కె వీరబాబు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో రైతులకు మేలు

విశాలాంధ్ర - నిడదవోలు : రైతు వారి ఎలుకల నిర్మూలన కన్నా సామూహిక ఎలుకల నివారణ రైతులకు మేలని జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం రైతు సేవా కేంద్రం వద్ద సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి గుత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాధవరావు రైతులతో మాట్లాడుతూ ఎలుకలు చాలా తెలివైనవని, రైతులందరూ కలిసి సామూహి కంగా ఒకేసారి వాటి నివారణ చర్యలు చేపట్టి నట్లయితే ఎలుకుల సంపూర్ణ నిర్మూలన సాధ్యపడు తుందన్నారు. నివా రణకు మందు పెట్టే పద్ధతే కాకుండా భౌతిక పద్ధతులైన పొగ పెట్టించడం, మనుషులచే పట్టించడం ఎలుకల బోనులు అమర్చటం వంటి అనేక ఇతర పద్ధతులను కూడా అనుసరిం చాలని తెలిపారు. నిడదవోలు మండల అధికారి జి సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు మాధవన్, శివనాగు, రైతులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : అందం, ఆత్మ విశ్వాసాన్ని ఇనుమ డింపజేసే అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను రాజమండ్రిలోని దానవాయిపేటలో ముఖ్య అతిథి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ వెల్ జే మాట్లాడుతూ అందాన్ని మెరుగుపర్చడంలో అత్యుత్తమ చికిత్స అందిం చడంలో మా క్లినిక్ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. మా ప్రయాణంలో ఇది మరో మైలురాయిని సూచిస్తుందన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సర్వీసు అందించడమే లక్ష్యమ న్నారు. జుట్టు మళ్లీ రావడంలోనూ, చర్మం పునరుజ్జీవనం లోనూ అత్యుత్తమ చికిత్స అందించనున్నామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతను సున్నితమైన సంరక్షణతో సమ్మిళిత చేస్తున్నామని చెప్పారు. ఈ క్లినిక్‌లో పెర్క్యుటేనియస్ ఎఫ్ యూ ఈ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, స్టెమ్ ఎక్స్ 27 ప్రో (పీఆర్పీ (ప్రో), లేజర్ హెయిర్ థెరపీ, రీజెన్ ప్రో 9 ఇతర ప్రత్యేక చికిత్సలు అందుబాటులో వున్నాయన్నారు.

జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌కు ప్రత్యేక కమిటీలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15 నుంచి 28 వరకూ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అంశాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో ఫిబ్రవరి 15 నుంచి 28 వరకు స్థానిక డిఎస్ఏ స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా అంశాల వారీగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసామన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జాయింట్ కలెక్టర్, డీఆర్ఓ, సీపీవో, డీఎస్డీవోలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణ అన్ని అంశాలను పర్యవేక్షిస్తుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఆర్డీవో,కాకినాడ, ఎడిసి-కెఎంసి, జిల్లా ఉపాధి అధికారి, డిటిసి సభ్యులుగా లాజిస్టిక్ కమిటీ పనిచేస్తుందన్నారు. అలాగే డిటిసి నేతృత్వంలో ట్రాన్స్ పోర్ట్, రిసెప్షన్ కమిటీ క్రీడాకారులకు స్వాగతం, రవాణా, బస సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. డిడి-గ్రౌండ్ వాటర్ నేతృత్వంలో రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రన్ ప్రక్రియ నిర్వహించి వారికి అవసరమైన ఏర్పాట్ల కోసం మిగిలిన సబ్ కమిటీలకు సూచించాలన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్-డియం నేతృత్వంలో ఫుట్ కమిటీ క్రీడాకారులకు ఆహర ఏర్పాట్లను, కాకినాడ ఆర్డిఓ నేతృత్వంలోని అకామిడేషన్ కమిటీ క్రీడాకారులకు బస ఏర్పాట్లను, ఏపిసి-సమగ్రశిక్ష నేతృత్వంలో టెక్నికల్ కమిటీ పోటీల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలను, డిఎంహెచ్ఓ నేతృత్వంలోని మెడికల్ కమిటీ కీడాకారులకు ప్రథమ చికిత్స, అంబులెన్స్ సేవలను నిర్వహించాలని ఆదేశించారు. కాకినాడ మున్సిపల్ కమీషన్ సహకారంతో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నేతృత్వంలో వెన్యూ అండ్ సరౌండింగ్స్ ప్రిపరేషన్ కమిటీ క్రీడాప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారాన్ని డిపిఆర్ఓ నేతృత్వంలో ప్రెస్ అండ్ మీడియా కమిటీ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే జిల్లా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ అధికారి నేతృత్వంలో పబ్లిసిటీ కమీటీ, డిఈఓ నేతృత్వంలో కల్చరల్ ప్రోగ్రామ్స్ కమిటీ ఆయా అంశాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమీషనర్ భావన, డిఎస్డిఓ బి శ్రీనివాస కుమార్, జడ్పి సిఈఓ వివివిఎస్ లక్ష్మణరావు, ఆర్డిఓలు ఎస్ మల్లిబాబు, కె శ్రీరమణి, ఆర్అండ్‌బి ఎస్ఈ జె కాంతు, డిఎంహెచ్ఓ నరశింహనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు పదవీవిరమణ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తహసీల్దార్ ఆర్‌వి వెంకటేశ్వరరావు మండలానికి చేసిన సేవలు ఎనలేనివని ఏలేశ్వరం మండల అధ్యక్షుడు గొల్లపల్లి బుజ్జి కొనియాడారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం తహసీల్దార్ ఆర్‌వి వెంకటేశ్వరరావు పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, వైస్ ఎంపిపి చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావులు హాజరయ్యి తహసీల్దార్‌ను సత్క రించి, జ్ఞాపిక అందజేశారు. ఎంపిపి గొల్లపల్లి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఎంతో పని వత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గోప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్ విజయ్ బాబు, ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, రెవిన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేరు జలాశయంలో చేప పిల్లల విడుదల

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరం గ్రామం వద్ద ఏలేరు జలాశయంలో సుమారు 1,38,600 కట్ల, రోహు, మృగాలా వంటి మేలు జాతి నాణ్యమైన చేప పిల్లలను ఎస్సీ, ఎస్టీలకు 60% సబ్సిడీతోను, బీసీలకు 40% సబ్సిడీతోను మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి కె కరుణాకరరావు చేప పిల్లలను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ రిజర్వాయరులో మత్స్య సంపదను పెంచుట ద్వారా లైసెన్సు కలిగిన మత్స్యకారులకు ప్రయోజనకరంగా ఉంటూ వారి జీవన ప్రమాణాలు పెంచుకొనుటకు తోడ్పడుతుందని తెలియచేశారు. మత్స్యకారులకు ఎన్ఎఫ్డిపి గుర్తింపు ప్రొవిజనల్ ధ్రువపత్రాలను అందజేశారు. మండల అభివృద్ధి అధికారి కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ మత్స్యశాఖ తరపున అందించే అన్ని పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందంజ వేయాలని, అభివృద్ధి పథంలో నడవాలని మత్స్యకా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎఫ్డిఓ ఆర్ నూకరాజు, మత్స్యశాఖ ఇన్స్పెక్టర్ బి రాజేంద్రరావు, ఫీల్డ్ మాన్ కె సురేష్, గ్రామ మత్స్య సహాయకులు వి శ్రీనుబాబు, జె అచ్చిరాజు, జె సునీత, ఎం మౌనిక, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారుల నియామకం

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఏలూరు జిల్లాలో ఎన్నికల కోడ్ ప్రారంభమైన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్, జిల్లా భద్రతా ప్రణాళిక(జిల్లా ఎస్పీ), మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు, బ్యాలెట్ బాక్సులు(జెడ్పి సిఇఓ),ఫస్టు ఎయిడ్ సెంటర్స్,కోవిడ్ నిబంధనల అమలు (డిఎంహెచ్ఓ), ఎన్నికల సిబ్బంది నియామకానికి (డిఇఓ), ఎన్నికల శిక్షణా కార్యక్రమాల నిర్వహణ(జెడ్పి డిప్యూటీ సిఇఓ, డ్వామా పిడి), రవాణా నిర్వహణ(డిటిసి), ర్యాండమైజేషన్ వెబ్ కాస్టింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐటి సంబంధ అంశాలు (డిస్టిక్ ఇన్ఫర్మెటిక్ ఆఫీసరు(ఎన్ఐసి), ఎడిఐవో,ఇడిఎం), రిపోర్టులు(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సివిల్ సప్లైయిస్), పోస్టల్ బ్యాలెట్ పేపర్(ఎస్సీ కార్పోరేషన్ ఇడి),బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ (ట్రైబుల్ వెల్ఫేర్ ఎస్ డిసి),మీడియా (డిఐపిఆర్ఓ), ఓటర్ల జాబితా(డిఆర్ఓ),ఎన్నికల పరిశీలకలకు ఏర్పాట్లు(జిల్లా ఎక్సైజ్ అధికారి, ఏలూరు ఆర్డిఓ), పోలింగ్ సిబ్బంది వెల్ఫేర్ మేనేజ్ మెంట్(జిల్లా సివిల్ సప్లైయిస్ మేనేజరు),వసతుల కల్పన(ఎస్ఇ పంచాయితీ రాజ్) కాల్ సెంటర్, ఫిర్యాదుల పరిష్కారం (జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి), హెల్ప్ డెస్క్(వయోజన విద్యా డిప్యూటీ డైరెక్టర్)లకు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణకు 10న తుది గడువుకాగా, 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణకు గడువు, ఫిబ్రవరి 27న పోలింగ్ , మార్చి 3న ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - భీమవరం : ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, ఫిబ్రవరి 1 నుంచి నిబంధనలు అమల్లోకి వస్తాయని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా ర్యాలీ నిర్వహించి, హోటల్స్‌కు స్టిల్స్ సామాగ్రిని అందించారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల తోపాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్లాస్టిక్ నిషేధ అమలపై తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ ప్రయత్నాల్లో ప్రతి హోటల్స్ లో అవగాహనా కోసం స్టీల్ సామాగ్రిని ఉచితంగా అందించడం గొప్ప విశేషమన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, సర్ సివి రామన్ స్కూల్ కరస్పాండెంట్ రావణం వేణుగోపాలరావు, స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరితా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తిచేయండి : కలెక్టర్

విశాలాంధ్ర - అమలాపురం : జొన్నాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వారం రోజుల్లో పూర్తిస్థాయిలో పున:ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత గుత్తేదారులు, రహదారులు భవనాలశాఖ జాతీయ రహదారుల ఇంజనీర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో గుత్తేదారులు, ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఫ్లై ఓవర్ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కారణాల మూలంగా నిలిచిపోయిన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణ పనులులో జాప్యాలు ఎదురయ్యాయని వీటిని అధిగమించి నిర్మాణ పనులలో మరింత పురోగతిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. వారం రోజులలో పనులను పున: ప్రారంభించాలని ఆదేశించారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి అవసరమైన మట్టిని సమకూర్చడం జరుగుతుందని అయితే శాస్త్రీయంగా పరిశోధన చేసి ఏ ప్రాంతంలో మట్టి నిర్మాణానికి అనువుగా ఉంటుందో నిర్ధారించుకోవాలన్నారు. ఫిబ్రవరి 14, 15, తేదీలలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. రావులపాలెం గ్రామంలో నిత్యం ఉండే ట్రాఫిక్ రద్దీని క్రమ బద్ధీకరించేందుకు వీలుగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు సమగ్ర ప్రతిపాదనలు భూసేకరణ, ఫ్లైఓవర్ నిర్మాణం అంశాలపై సిద్ధం చేయాలని జాతీయ రహదారులు ఇంజనీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకులు డి సురేంద్రనాథ్, సృష్టి కాంట్రాక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్ రామకృష్ణ, టీం లీడర్ కన్సల్టెన్సీ ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: ఆపదలో ప్రాణాలు కాపాడే వైద్యులను ప్రజలు దైవంతో సమానంగా భావిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పేదలకు సకాలంలో నూరుశాతం నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీపీ సమావేశ మందిరం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలిని, డిసిహెచ్ ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఎన్‌టిఆర్ వైద్య సేవల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీల నమోదు, ఎన్ సిడి,ఆర్ బిఎస్ కె,ప్రసవాలు, వెక్టార్ బోర్న్ వ్యాధుల నివారణ, ఎన్‌టిఆర్ వైద్యసేవా,ఇమ్యూనైజేషన్, కుష్ఠ వ్యాధినివారణ కార్యక్రమం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి గర్భిణుల వివరాలు ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది సేకరించి రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా నమోదైన గర్భిణులకు ముఖ్యంగా హైరిస్క్ గర్భిణీలకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగ్యూ లాంటి వెక్టర్ బోర్న్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాల న్నారు ఈ సందర్భంగా పిఎంఎజెవై,ఎన్ టిఆర్ వైద్య సేవల ప్రగతితీరుపై సమీక్షించారు. ఏరియా,సిహెచ్ సి,పిహెచ్ సి, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌ని అభివృద్ధి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : మండలంలోని వాకలపుడి వద్దనున్న బీచ్ పార్క్ సందర్శకులకు అనువుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి పంచాయతీ, పర్యాటకశాఖ, జిల్లా ప్రజా పరిషత్, తదితర శాఖల అధికా రులతో సమావేశం నిర్వహించారు. కాకినాడ సముద్రతీర ప్రాంతంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, బీచ్ క్లీనింగ్, నూత నంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యక్ర మాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చిం చారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాకినాడ బీచ్‌ను అనేక వేలమంది సందర్శిస్తూ ఉంటారన్నారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బీచ్ ప్రాంతాన్ని సుందరంగా, శుభ్రంగా ఉండేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జేడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో పీ త్రినాథ్, జిల్లా పర్యాట కశాఖ అధికారి పసుపులేటి పోశయ్య, అసిస్టెంట్ టూరిజం అధికారి వి త్రిమూర్తులు, ఏపీటీడీసీ ఏఈ వెంకటేష్, కుడా ఈఈ రామారావు, జిల్లా పంచాయతీ అధికారులు ఇతర అధికారులు పాల్గొన్నారు.